www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 13 ఆగస్టు 2023
5
చిత్తూరు





ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

పాతపెన్షన్ విధానం వచ్చే వరకు ఉద్యమం ఆగదు

ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు పిలుపు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం తప్ప వేరే ప్రత్యామ్నాయం తమకు ఆమోదయోగ్యం కాదని ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. శనివారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు మునాఫ్ అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలను తక్కువ అంచనా వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులతో స్నేహపూరిత వాతావరణం కొనసాగిస్తామని హామీ ఇచ్చిన పాలకులు తద్విరుద్ధంగా వ్యవహరించడం దారుణమని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి, మాట తప్పడం, మడమ తిప్పడం సరికాదన్నారు. కొందరు నాయకులు ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేయడం సబబు కాదన్నారు. 117 జీవో అమలు వల్ల విద్యారంగం అస్తవ్యస్తంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక విద్యాభ్యాసం మాతృభాష మాధ్యమంలోనే కొనసాగాలని కేంద్ర ప్రభుత్వం, సిబిఎస్సి బోర్డు స్పష్టం చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వైఖరి అప్రజాస్వామికంగా, అసంబద్ధంగా ఉందని విమర్శించారు. గత పిఆర్సి అన్యాయాలను సరిదిద్దకుండానే కొత్త పిఆర్సి కమిషనర్ ను నియమించడం కంటి తుడుపు చర్యేనన్నారు. రాత్రి 10 గంటల సమయంలోనూ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తూ నినదించారు. ఉద్యమాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమైతాయి తప్ప పైరవీల ద్వారా కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రఘుపతి, జీవి రమణ ముత్యాల రెడ్డి, సోమశేఖర్ నాయుడు లతోపాటు ఎస్టియు, ఏపీటీఎఫ్ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అయ్యో... లక్షిత..

- చిరుత దాడిలో బలి
- నడకదారిలో విషాదం
- టిటిడి నిర్లక్ష్యం వల్లేనా..!

ప్రజాశక్తి - తిరుమల/ కోవూరు

కొన్నాళ్ల క్రితం జూన్ 23న నడకదారిలో వెళుతున్న ఆరేళ్ల కౌశిక్‌పై చిరుత దాడికి పాల్పడింది.. భక్తులు పెద్దగా అరవడంతో బాలుని వదిలేసి వెళ్లింది. గాయపడిన బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొంది మృత్యుంజయుడై ఇంటికెళ్లాడు.. 'దేవుడే కాపాడాడు' అని ఓ సమీక్షా సమావేశంతో టిటిడి సరిపుచ్చింది.. అపుడే నడకదారిలో భక్తుల భద్రత విషయాన్ని టిటిడి సీరియస్‌గా తీసుకుని ఉంటే చిరుత దాడిలో బాలిక లక్షిత బలయ్యేది కాదేమో.. తల్లిదండ్రులు దినేష్‌కుమార్, శశికళలకు కడుపుకోత ఉండేది కాదు.. కొద్ది నెలల్లోనే ఈ రెండు ఘటనలు.. ఏడాదిగా పరిశీలిస్తే ఎన్నో ఘటనలు.. అయినా తిరుమల తిరుపతి దేవస్థానం ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండటం వల్లనే భక్తులకు భద్రత లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కౌశిక్‌ను రక్షించిన దేవుడు లక్షితను ఎందుకు కాపాడలేకపోయాడో టిటిడి ఉన్నతాధికారులు చెప్పాల్సి ఉంది. కేవలం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించి, భద్రతను కట్టుదిట్టం చేస్తామని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డిలు మరోసారి ఉద్ఘాటించడం గమనార్హం. లక్షిత మృతితోనూ తూతూమంత్రంగా సమీక్ష నిర్వహించిన టిటిడి ఉన్నతాధికారులు ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూడగలరేమో వేచి చూడాల్సిందే.

భక్తుల భద్రతపై నిర్లక్ష్యమెందుకు?

భక్తులు బాగుంటేనే టిటిడికి కోట్లల్లో ఆదాయం వస్తుంది. అలాంటిది భక్తుల భద్రతపై టిటిడి ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. తిరుమల తిరుపతి దేవస్థానం ఏడుకొండల్లోని అటవీ ప్రాంతంలో ఉంది.. వన్యప్రాణులు సంచరించే ప్రాంతం.. క్రమేపీ తిరుమల విస్తీర్ణం పెరుగుతుండడంతో జంతుజాలం భక్తుల చెంతకు వస్తున్నాయి. ఎన్నోసార్లు ఆరేడు అడుగుల పెద్దపెద్ద నాగుపాములను సైతం భక్తుల విశ్రాంతి గృహాల వద్దనే పట్టుకున్న ఘటనలు ఉన్నాయి. ఘాట్‌రోడ్లపై చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు అపుడపుడూ కనిపిస్తూనే ఉంటాయి. కౌశిక్ ఘటనలో భక్తులు గుర్తించి వెంటనే పెద్దగా అరిచారు కాబట్టి బతికి బయట పడ్డాడు. లేకుంటే.. అంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది.. అయితే ఆ ఘటన తర్వాతనైనా టిటిడి ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలేంటో చెప్పాల్సి ఉంది. నడకదారిలో ఇరువైపులా రాత్రిపూట కృత్రిమ విద్యుత్ అగ్గి మంటలను ఏర్పాటుచేయాలి. నడకదారిలో పిల్లల్ని ఖచ్చితంగా వెంట ఉండి తీసుకెళ్లాలని అక్కడక్కడ బోర్డుల్లో సూచించాలి. అంతేకాదు రక్షణ సిబ్బంది సైతం భక్తులను ఆ విధంగా హెచ్చరించాలి. అలాగాకుండా ఒంటరిగా వదిలేయడం వల్లే పులి ఎత్తుకెళ్లిందని, ఇది తల్లిదండ్రుల తప్పన్నట్లుగా సిసి ఫుటేజిల్లో చూసి చెప్పడం అనేది భక్తులకు 'రాంగ్ మెసేజ్'ను ఇచ్చినట్లే. కేరళ రాష్ట్రం శబరిమల నడకదారిలోకి పులులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో అధ్యయనం చేయాలి. ఖచ్చితంగా నడకదారి మార్గంలో ఫారెస్టు అధికారులతో సమన్వయం చేసుకుని 'కంచె' వేయడం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం అని మేధావులు చెబుతున్నారు. మనిషి రక్తం రుచి చూసిన మృగాలు ఊరికే ఉండబోవనీ హెచ్చరిస్తున్నారు. పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఉందన్న టిటిడి గంటలు గడుస్తున్నా బాలికను చంపిన జంతువేదో చెప్పలేకపోవడం గమనార్హం. టిటిడి డిఎఫ్ఒ ఎలుగుబంటి చంపి ఉండొచ్చు అని చెబుతుంటే, రుయా అధికారులు పోస్టుమార్టంలో చిరుతే చంపిందని స్పష్టం చేస్తున్నారు. ఎందుకింత అస్పష్టమైన భద్రతనేది విచారణలో తేలాల్సి ఉంది



శోకసంద్రంలో పోతురెడ్డిపాలెం

తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లడంతో అక్కడ చిరుత దాడిలో మతి చెందిన లక్షిత (6) మతదేహాన్ని శనివారం కోవూరు మండలంలోని పోతిరెడ్డి పాలెం గ్రామానికి తీసుకొచ్చారు. చిన్నారి మతి దేహాన్ని చూసిన తల్లిదండ్రులు దినేష్, శశికళ తమ బిడ్డను చిరుత చంపేసిందయ్యా అంటూ కన్నీటి పరమవడంతో చూపరులను కలిచివేసింది. చిరుత దాడిలో మతి చెందిన చిన్నారి లక్షిత మతదేహాన్ని చూసేందుకు పోతిరెడ్డి పాలెం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున చేరుకోవడంతో గ్రామం మొత్తం శోక సంద్రంలో మునిగిపోయింది. పోతిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన దినేష్, శశికళ దంపతులకు లక్షిత (6) నిఖిత్ (4) ఉన్నారు. తండ్రి దినేష్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని ఎంతో అన్యోన్యంగా చూసుకునేవారు. ఇరువురు చిన్నారులను కోవూరులోని ప్రయివేట్ పాఠశాలలో చదివించుకుంటున్నారు. దినేష్ తన కుటుంబంతో పాటు చెన్నూరులో ఉన్న తన చెల్లి కుటుంబంతో కలిసిమొత్తం పదిమంది శ్రీవారి దర్శనానికి శుక్రవారం వెళ్లారు. దేవుని మొక్కుబడిని తీర్చుకోవడంలో భాగంగా అలిపిరి కాలినడక మార్గంలో శుక్రవారం 3.45 గంటల సమయంలో మెట్లపై నడక ప్రారంభించారు. ఎంతో హుషారుగా ఉండే లక్షిత అందరికంటే ముందుగా మెట్లను చకచకా ఎక్కుతుండగా తల్లిదండ్రులు ఆనందపడ్డారు. మెట్ల పక్కన ఉండే భక్తులు ఇచ్చిన బిస్కెట్లను తింటూ నీటి బుడగలను ఊదుతూ ఆనందంగా మెట్లు ఎక్కుతూ సాయంత్రం 6:45 గంటలకు కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు గోడ పక్కన నక్కి తమను ఆటపట్టిస్తుందనుకున్నారు. ఎంతసేపటికి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు భయంతో వణికిపోయారు. వెంటనే మెట్లు ఎక్కి చుట్టుపక్కల తీవ్రంగా గాలించారు. పెద్దగా కేకలు వేసి పిలిచినా పలకకపోవడంతో ఆందోళన చెందారు. రాత్రి 8గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు రాత్రి కావడంతో తెల్లవారుజామున గాలించడంతో ఉదయం 7గంటలకు అడవిలో లక్షిత విగత జీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీటిపరమయ్యారు. ఈ విషయం తెలియడంతో పోతిరెడ్డి పాలెం గ్రామం ఒకసారిగా దిగ్భ్రాంతికి గురైంది. శుక్రవారం మధ్యాహ్నం చిన్నారి లక్షిత మతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో పెద్ద ఎత్తున మహిళలు, యువత కన్నీటి పరమయ్యారు. నిన్నటి వరకు తమ కళ్ల ముందే ఆడుతూ పాడుతు ఎంతో హుషారుగా ఉన్న చిన్నారి లక్షిత చిరుత దాడిలో మతి చెందడంతో ఒక్కసారిగా పోతిరెడ్డి పాలెం గ్రామం విషాదంలో మునిగిపోయింది.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలి : సిపిఎం

చిరుత దాడిలో లక్షిత చిన్నారి మృతిచెందిందని, ఇందుకు టిటిడినే బాధ్యత వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జయచంద్ర పేర్కొన్నారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇచ్చి కుటుంబంలో ఒకరికి టిటిడిలో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కేరళలో అయ్యప్పస్వామి భక్తులకు అడవి జంతువులు దాడి చేయకుండా ఉండటం కోసం టపాకాయలు కాల్చడం, శబ్దాలు చేయడం వంటి భద్రతా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా, భక్తుల్లోనెలకొన్న అభద్రతా భావాన్ని పోగొట్టి యుద్ధప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రుయా మార్చురీలో విగతజీవిగా ఉన్న లక్షిత మృతదేహాన్ని సిపిఎం నేతలు టి.సుబ్రమణ్యం, కె.వేణు, పి.మునిరాజా, తంజావూరు మురళి, డి.పార్థసారథితో వెళ్లి పరిశీలించారు. లక్షిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు గొల్ల నరసింహయాదవ్ స్పందిస్తూ ఇది ఖచ్చితంగా టిటిడి నిర్లక్ష్యం వల్లే జరిగిందని మండిపడ్డారు.

'కంచె' వేసేందుకు తర్జనభర్జన ఎందుకు?

ఏడుకొండలవాని స్వామిని చూడాలంటే భక్తులు ఏడుకొండలూ ఎక్కాల్సిందే.. ఎక్కువగా నడకదారిలో భక్తులు పిల్లలతోనే మొక్కు తీర్చుకునేందుకు వెళుతుంటారు. దారికి అటూఇటూ గ్రిల్స్ పెట్టడంపై ఉన్నతాధికారులు తర్జన భర్జన పడుతున్నారు. వన్యప్రాణ చట్టాలు అడ్డొస్తున్నాయని ఫారెస్టు సిబ్బంది చెబుతున్నారు.. ఎన్నో చట్టాలను అలవోకగా మార్చేసే పాలకులు భక్తుల భద్రతకు ఇబ్బందిగా ఉన్న చట్టాలను ఎందుకు మార్చరో 'శ్రీవారి'కే తెలియాల్సి ఉంది.



సొమ్మసిల్లిన లక్షిత అమ్మమ్మ

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేవీవీ నాయకులు అరుణ శివప్రసాద్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: క్లిష్ట సమస్యల సాధనలో గణితం ఒక సాధనం. సమస్యల సాధనలో గణితం ప్రాధాన్యత నేటి ఆధునిక ప్రపంచంలో అత్యంత ఆవశ్యకం. చిన్నపాటి గణిత సమస్య సాధనకు భయపడిపోయే నేటి విద్యార్థులలో ఆత్మస్థైర్యం నింపడానికి గణిత శాస్త్ర ప్రావీణ్యుడు, గణిత అవధాని హెచ్ అరుణ శివప్రసాద్ బంగారుపాళ్యం మండలం, మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులైన హేమ, లహరి, రేవతి, పునీత్ సాయి లతో అవలీలగా గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత గణిత ఆచార్యులు రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులతో రాష్ట్రంలోని ఏ పాఠశాలలో నిర్వహించని ఈ కార్యక్రమం ఓ అద్భుతమని, విద్యార్థుల ప్రజ్ఞకు మంత్రముగ్ధనయ్యానని వారిని అభినందించారు. చిత్తూరు ఎంఈఓ 2 మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల ప్రతిభ అసాధారణం అని తెలపడానికి నిదర్శనమే ఈ కార్యక్రమం అని అన్నారు. కాసిరాలగొల్లపల్లి ప్రధానోపాధ్యాయురాలు లలిత మాట్లాడుతూ విద్యార్థుల ధారణ అమోఘమని త్వరలో ఈ అద్భుత కార్యక్రమాన్ని మా పాఠశాలలో నిర్వహిస్తామని తెలిపారు. మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గణిత ప్రతిభ ఓ వరమని దానికి వేగం, కచ్చితత్వం అవసరమని, ఇవన్నీ మా పాఠశాల విద్యార్థుల ప్రతిభలో ఇమిడి ఉన్నదని వారిని కొనియాడారు. గణిత అవదాని అరుణ శివ ప్రసాద్ శిష్య బందంతో శనివారం అరవై రెండు అంకెల సంఖ్యలు సబికులు చెప్పగా వాటిని విద్యార్థులు మొదటినుండి చివరికి చివరి నుండి మొదటికి చెప్పారు. 120 అంకెల సంఖ్యను 5చే, 25చే గుణించి సమాధానాలు చెప్పారు. ఇవి కాల్క్యులేటర్, కంప్యూటర్‌లతో కూడా చేయలేమని సబికులు ఆశ్చర్యం వ్యక్త పరిచారు. అనంతరం సరస్వతి ఛారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన అమరనాథ రెడ్డి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసారు. కార్యక్రమంలో గణిత ఫోరమ్ జిల్లా కార్యదర్శి చంద్రమ నాయుడు, విజయం విద్యా సంస్థల డైరెక్టర్ తేజోమూర్తి, అకాడమిక్ కోఆర్డినేటర్ రాజగోపాల్, నాగమణి, మాధురి, మంగళ పల్లి పాఠశాల ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కేంద్రం ప్రతిపాదించిన నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని, సిపిఎస్‌ను వెంటనే రద్దు చేసి దేశవ్యాప్తంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు డిమాండ్‌చేశారు. తిరుపతియ ఉటిఎఫ్ కార్యాలయంలో అఖిల భారత ఉపాధ్యాయ సంఘం ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల పాలిట గొడ్డలిపెట్టుగా ఉన్న నూతన విద్యా విధానాన్ని తక్షణమే కేంద్రం ఉపసంహరించుకోవాలన్నారు. అశాస్త్రీయమైన పాఠ్యాంశాలను సిలబస్‌లో చొప్పించడాన్ని మానుకోవాలన్నారు. విద్యార్థులకు శాస్త్రీయమైన, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించాలన్నారు. 2004, సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి దుర్మార్గంగా ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి దేశవ్యాప్తంగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెన్షన్ ప్రాథమిక హక్కుగా పేర్కొన్న సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించి దేశవ్యాప్తంగా ఉద్యోగులందరికీ పాత పెన్షన్ వర్తింపజేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి మాట్లాడుతూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్‌లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఎస్‌టిఎఫ్ఐ ఆధ్వర్యంలోపెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. నవంబర్ 3న కొత్త ఢిల్లీలో నిరసన ప్రదర్శన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరాల నిర్మల, కందల శ్రీదేవి, దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్‌రెడ్డి, అవనిగడ్డ పద్మజ, మోహన్‌బాబు, దాసరి మునయ్య, వెంకటకృష్ణ, ఒ.విజయ్‌కుమార్, శివకుమార్, నాగార్జున పాల్గొన్నారు.

'కరుణ'కే 'శ్రీవారి' కటాక్షం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజా'దృష్టి'

తిరునగరిలో ప్రచార తిరనాళ్లు వేడెక్కింది. అధ్యాత్మిక నగరం కాస్త ఆట్టహాసంగా మారింది. అంతా ఆయన వైపే మొగ్గు. ఇదంతా స్థానిక నాయకుడికి రెండో సారి ఛైర్మన్‌గిరి దక్కడమే కారణం.

తిరుపతి శాసనసభ్యులు, సీనియర్ రాజకీయ నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డిని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పాలకమండలి సభ్యులుగా రెండోసారి నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఇప్పటి వరకు కొనసాగిన వైవి.సుబ్బారెడ్డి పాలకమండలి కాలం ఈ నెల 8వ తేదితో ముగిసింది. వైవి.సుబ్బారెడ్డి సైతం రెండు సార్లు ఛైర్మన్‌గా కొనసాగారు. రెండు పర్యాయాలకు ముందు నుంచి ఆ పదవి కోసం ప్రయత్నం చేసినా మరో సీనియర్ నాయకులు కెఇ కృష్ణమూర్తికి రెండో 'సారీ' మొండి చెయ్యే మిగిలింది. 2024 సాదారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో పదవుల పంపకాల్లో వివాదాలు ఎందుకనుకున్నారో ఏమో? ఈ సారి స్థానికుల వైపే అధినేత మొగ్గు చూపారు. రెండోసారి భూమన కరుణాకర్‌రెడ్డికి ఛైర్మన్ పదవి దక్కింది. ఆయనను ఛైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటి నుంచి తిరుపతి నగరంలో పండగ వాతావరణం నెలకొంది. నిత్యం జనాల రాకతో నిండుగా ఉండే ఎంఎల్‌ఏ నివాసం మరింత రద్దీ పెరిగింది. రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజా సంఘాలు, విద్యార్థి, మహిళా, కార్మిక, కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అందరూ ఆయన ఇంటికి క్యూ కట్టారు. పుష్పగుచ్ఛాలు, గజమాలలు, దుశ్శాలవలతో ఆయనను సత్కరించారు. తిరుపతి నగరం మొత్తం దైవకైంకర్యాలకే మరోసారి అంటూ నినాదాలతో వేలాది ఫ్లెక్సీలు వెలిశాయి. మీడియ ప్రచారాలు హోరెత్తాయి. గురువారం భూమన కరుణాకర్‌రెడ్డి టిటిడి ఛైర్మన్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టారు. ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులతో బయలుదేరిన ఆయన మంత్రులు, ఎంఎల్‌ఏలు, ప్రజాప్రతినిధులు వెంటరాగా అలిపిరికి చేరుకుని గోపూజ నిర్వహించారు. అలిపిరిపాదాల మండపం వద్ద కుటుంబ సమేతంగా ప్రదక్షణలు చేశారు. తిరుమలకు చేరుకున్న ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం లభించింది. శ్రీవారిని దర్శించుకుని, ఛైర్మన్‌గా బాధ్యతులు స్వీకరించారు. సుమారు గంటన్నరకు పైగా ఆలయంలో గడిపిన ఆయన అనుచరుల ఆనందకేరింతల మధ్య వెలుపలికి వచ్చి, అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఛైర్మన్‌గా చేసిన అనుభవం, అసెంబ్లీ ఎన్నికలు సమీస్తున్న తరుణంలో స్థానికుడైన కరుణాకర్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి, నగరాభివృద్ధికి చొరవ చూపుతారని అందరూ ఆశిస్తున్నారు. దశ శత దినాలకు పైగా నిరసన దీక్షలో కొనసాగుతున్న టిటిడి అటవీకార్మికులకు న్యాయం జరుగుతుందని ఆశతో ఎదురు చూస్తున్నారు. నగరానికి అంతా మంచే జరుగుతుందని ఆశిద్దాం.. తిరునగర అభివృద్ధికి సహకరిద్దాం.

యాదవుల సభ ఎవరికోసం?

ప్రజాశక్తి-పుంగనూరు: నియోజకవర్గ కేంద్రంలో యాదవుల ఆత్మీయ సమావేశంపై స్థానికంగా ఉన్న యాదవులకు పలు అనుమానాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో ఎప్పుడూ జరగని యాదవుల ఆత్మీయ సమావేశం ఎన్నికలు సమీపిస్తుండటంతో నిర్వహిస్తుంటే ఓట్ల కోసమా లేక వారి రాజకీయ, ఆర్థిక ఎదుగుదలకా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏది ఏమైనా పుంగనూరు నియోజకవర్గంలో గెలుపు, ఓటములు నిర్ణయించే స్థాయి యాదవ సామాజిక వర్గానికి ఉన్నది. ఇక్కడి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి ఏ సామాజిక వర్గం నుండి అయినా చెక్కు చెదరని క్యాడర్ ఉంది. ఇటీవల పుంగనూరు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బోడె రామచంద్ర యాదవ్ ఓ రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడంతో యాదవ ఆత్మీయ సమావేశం పుంగనూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పార్టీ ఆవిష్కరణ సభ గుంటూరులో ఏర్పాటు చేయడం, భారత చైతన్య యువజన పార్టీగా నామకరణం చేయడం, బహిరంగ సభ కూడా కొంతమేర సక్సెస్ అయిందని రాజకీయ వర్గాల్లో అప్పట్లో చర్చ నడిచింది. యాదవ ఆత్మీయ సమావేశం ఏర్పాటుపై నియోజకవర్గంలో పలు రకాల చర్చలు మాత్రం నడుస్తున్నాయి. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ నుండి బోడె రామచంద్ర యాదవ్ పోటీ చేయడం, అప్పట్లో ఆయనకు 16452 ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే వైసీపీలో డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి1,07,431 ఓట్లు రాగా సమీప తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నూతన కాలువ అనూష రెడ్డికి 63,876 ఓట్లు వచ్చాయి. పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి కి 43,555 ఓట్ల మెజార్టీ రావడం జరిగింది. నియోజకవర్గంలో యాదవ సామాజిక వర్గం సుమారు 26 వేలు ఉన్నట్లు, వీటిలో 20 వేలు ఓటర్లు ఉన్నారని అంచనాలు ఉన్నాయి. ప్రధానంగా పుంగనూరు, చౌడేపల్లి మండలాలలో మాత్రం యాదవ సామాజిక వర్గం అధికంగా ఉన్నారు. సోమల, సదుం, రొంపిచర్ల, పులిచెర్ల మండలాల్లో నామమాత్రంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ సభకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి యాదవులను తీసుకురావాలని వైసిపి నేతలు తలమునకలై ఉన్నారు.

పుంగనూరు మండలంలో బలమైన ఆర్థిక, అంగ బలమున్న నేతగా ముడా ఛైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్ ఆత్మీయ సమావేశాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని ప్రయత్నాల్లో అయితే ఉన్నారు. అయితే ఓవైపు తెలుగుదేశం పార్టీలో ఉన్న యాద వులు, ఇటీవల కొత్తగా ఏర్పాటుచేసిన భారత చైతన్య యువజన పార్టీలోని యాదవులు, వైసీపీ లోనే మరో వర్గం ఉన్నారు. వర్గాలన్నింటినీ కలుపుకొని యాదవులు సమావేశానికి తరలించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. సమావేశానికి సుమారు 10 వేల మందిని యా దవ సామాజిక వర్గానికి ఆత్మీయ సమావేశానికి వచ్చేందుకోసం ఏర్పాటు చేస్తున్నారు. వారికి భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకొని ప్రత్యేక వాహనాల ద్వారా తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అంతేకా కుండా వైసిపి యాదవ రాష్ట్ర నాయకత్వం కూడా పుంగనూరులో మఖాం వేసి ఉంది.

శుభ్రం చేయడం పూర్వజన్మ సుకృతం

'సుందర తిరుమల..శుద్ధ తిరుమల'లో ఈవో



ప్రజాశక్తి-తిరుమల: తిరుమల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా నిర్వహిస్తున్న "సుందర తిరుమల-శుద్ధ తిరుమల" కార్యక్రమాన్ని శనివారం ఉదయం అలిపిరి టోల్ గేట్ వద్ద టీటీడీ ఈవో ఏవి. ధర్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములు కావడం పూర్వజన్మ సుకతమని ఆయన అన్నారు. తిరుమల ఘాట్ రోడ్లు , నడక మార్గాల్లో టీటీడీ విద్యా సంస్థల్లోని సుమారు 1000 మంది విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులతో ఈ కార్యక్రమం నిర్వహించారని చెప్పారు. పచ్చదనాన్ని పెంపొందించడం, తిరుమలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడానికి మే 13వ తేదీ టీటీడీ లోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు ఈ కార్యక్రమం నిర్వహించారని చెప్పారు. ప్రతి మూడు నెలలకోసారి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. విద్యార్థులు రెండు ఘాట్ రోడ్లు, అలిపిరి, శ్రీవారి మెట్టు నడకమార్గాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించినట్లు చెప్పారు. విద్యార్థులకు అవసరమైన గ్లౌజులు, మాస్కులు, ప్లాస్టిక్ బ్యాగులు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో. జేఈవో శ్రీమతి సదా భార్గవి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం విసి ఆచార్య రాణి సదాశివమూర్తి, ఎస్ వి యు విసి ఆచార్య రాజారెడ్డి, మహిళా యూనివర్సిటీ విసి ఆచార్య భారతి, రిజిస్ట్రార్ రజని, ఎస్ ఈ - 2 జగదీశ్వర్ రెడ్డి, డిఇఓ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

విత్తనాల కిట్లు పంపిణీ



ప్రజాశక్తి-శాంతిపురం: మండల పరిధిలోని ప్రకృతి వ్యవసాయదారులకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం అజయ్' ద్వారా జీరో బడ్జెట్ నేషనల్ ఫార్మింగ్ పథకంలో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయదారులకు విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. శనివారం స్థానిక ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్‌బిఎన్‌ఎఫ్ ద్వారా ప్రకృతి వ్యవసాయం చేసి లాభాలు గడించడం ఎలాగో రైతులకు శిక్షణను ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 1205 మంది ఎస్సీ కులానికి చెందిన రైతులను ఎంపిక చేసి వారికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చినట్టు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు తెలిపారు. కుప్పం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో 518 మంది రైతులకు సుమారు రూ.9500 విలువ కలిగిన విత్తనాల కిట్టు, మరికొన్ని వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్సీ భరత్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సమావేశంలో మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ కనకారావు, రెల్లి కార్పొరేషన్ ఛైర్మన్ మధుసూదన్ రావు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు రవిబాబు, రవికుమార్, శ్రీనివాసులు, బిపిఎం వాసు, దళిత ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

రేపు యాదవ ఆత్మీయ సమావేశం



ప్రజాశక్తి-పుంగనూరు: నియోజకవర్గ కేంద్రంలో వైసీపీ నిర్వహిస్తున్న యాదవ ఆత్మీయ సమావేశ సభను జయప్రదం చేయాలని ముడా ఛైర్మన్ ఎన్ వెంకట్ రెడ్డి యాదవ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరు సమీపంలోని రాంపల్లి వద్ద ఈనెల 14న యాదవ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభలో వైసీపీ యాదవ సమాజ సంక్షేమంపై రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దిశా నిర్దేశం చేయడం జరుగుతుందని తెలియజేశారు. అంతేగాక ఈ ఆత్మీయ మహాసభకు మాజీ మంత్రులు, రాజ్యసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు పాల్గొంటారని తెలిపారు. నియోజవర్గ పరిధిలోని యాదవ సామాజిక వర్గం అంతా తమ కార్యక్రమంగా భావించి ఒకరికొకరు తోడుగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో సభ ఏర్పాట్లు జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు.

అన్నదానం చేయడం అదృష్టం




ప్రజాశక్తి-కార్వేటినగరం: పేదలకు అన్నదానం చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని ఫిజియోథెరపిస్టు డాక్టర్ బీ.ఝాన్సీ అన్నారు. శనివారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణంలో తిరుపతికి చెందిన ఫిజియోథెరపిస్టు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ అన్నిదానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని, అలాంటి సేవలు అందించే వారికి స్వామివారి అభయం ఎప్పుడూ ఉంటుందన్నారు. టీటీడీ అనుసంధాన ఆలయాల్లో ఒక్కటైన వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో ప్రతి శనివారం జరిగే అన్నదాన కార్యక్రమానికి దాతలు ముందుకొచ్చి పేదలకు అన్నదానం చేపట్టి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు విరివిగా రుణాలు



ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా డ్వాక్రా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైసీపీ కార్యదర్శి తమ్మిరెడ్డి అన్నారు. శనివారం పుంగనూరు ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మండలంలోని రాజుపల్లిలో స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ ఖాతాదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఇన్యూరెన్స్ సదుపాయాలను వివరించారు. అలాగే బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించి, మరిన్ని రుణాలను పొందవచ్చన్నారు. బ్యాంకు సేవలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో సంఘమిత్ర, డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్తు మారెమ్మ జాతర



ప్రజాశక్తి-యాదమరి: మండలంలోని 155 కమ్మపల్లి హరిజనవాడ గ్రామస్తులు ముత్తు మారెమ్మ జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఉదయం అమ్మవారికి పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించారు. పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ మురళీ మోహన్, నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ నాయుడు, మండల టిడిపి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మొరార్జీ యాదవ్, వెంకటేష్ రబీ, మండల తెలుగు యువత అధ్యక్షుడు గుణశేఖర్ రాయల్‌లు అమ్మవారి జాతరకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి నేతలకు స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో రవి, సత్య, రాజా, రామ్మూర్తి, జయశంకర్, ప్రకాశ్, మేనక తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి



ప్రజాశక్తి-శాంతిపురం: రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయవలసి ఉందని, దానికి సంబంధించిన చర్యలు తీసుకోవాలని కెనమాకులపల్లి సర్పంచ్ ఎ.వి. జయరాం కోరారు. మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరగాల్సి ఉండగా కోరం లేని కారణంగా అధికారులు శనివారం నిర్వహించారు. మండల సచివాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ముఖ్యమైన సమస్యలను తెలియజేయాలని ఎంపీపీ వసుంధర కోదండరెడ్డి మండల సమావేశంలో సభ్యులను కోరారు. గుంజార్లపల్లి సర్పంచ్ ఈ. విజయరామిరెడ్డి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రెవెన్యూ సమస్యలపై చర్చ మొదలు పెట్టాలని కోరగా ఎన్నికల విధుల వల్ల సమావేశానికి తహశీల్దార్ కొంచెం ఆలస్యంగా వస్తారని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. చిన్నారి దొడ్డి సర్పంచ్ రేణుకా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కొత్తపేట నుండి ఎస్ గొల్లపల్లి వరకు మట్టి రోడ్డు సంబంధిత పనులు నిలిచిపోయాయని త్వరితగతిన ఆపనులు పూర్తి చేయాలని కోరారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి స్పందిస్తూ సంబంధిత దారిలో రెండు సర్వే నెంబర్లలో సమస్య ఉన్నందువల్ల రహదారి పనులు ఆలస్యం అవుతుందని ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు తెలియజేశామన్నారు. 64 పెద్దూరు పంచాయతీ గెసిక పల్లిలో ఓవర్ హెడ్ ట్యాంక్ ఆనుకుని ఉన్న స్థలాల్లో అనధికారికంగా ఇంటి నిర్మాణాలు చేస్తున్నారని సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ యువకుమార్ కోరారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఎంపీపీ సూచించారు. ఈ సమావేశంలో121 పెద్దూరు బెండన కుప్పం పంచాయతీలలో రేషన్ బియ్యాన్ని ఎండియు లు వాహనాల్లో కాకుండా కొన్ని ప్రదేశాలలో బియ్యాన్ని నిలువచేసి అక్కడే పంపిణీ చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని 121 పెద్దూరు ఎంపీటీసీ రవి కుమార్ కోరారు. ఈ సమయంలో సమావేశానికి చేరుకున్న తహశీల్దారు ఈ అంశంపై మాట్లాడుతూ ఎండియు ఆపరేటర్లు కొన్ని గ్రామాలలో బియ్యం సరఫరా సరిగ్గా చేయటంలేదన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని పై అధికారులకు తెలియజేశామని అన్నారు. మండలంలోని ఇద్దరు ఎండియు ఆపరేటర్లు ఇప్పటికే వారి రాజీనామాను సమర్పించారని తహశీల్దార్ తెలిపారు. సమస్యలు ఉన్నచోట వీఆర్వోల సహాయంతో ప్రజా పంపిణీ బియ్యాన్ని సరఫరా చేస్తామని తెలిపారు. జడ్పిటిసి శ్రీనివాసులు ఈ విషయంపై ప్రసంగిస్తూ ఎండీయూల ఇబ్బందులున్న విషయం వాస్తవమేనని ఈ మండలానికి మరిన్ని వాహనాలు రప్పించి ప్రజా బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతే కాకుండా రెవెన్యూ పరమైన సమస్యలతో తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలతో, నాయకులతో గౌరవప్రదంగా, మర్యాదపూర్వకంగా మాట్లాడాలని ఎమ్మార్వోకు, మండలంలోని అధికారులకు తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న కారణంగా సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని త్వరితగతిన ముగించారు. కాగా ఈ సమావేశానికి నిజమైన ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్తలు, బంధువులు కాకుండా వారే వచ్చి సమస్యలపై పోరాటం చేయడం కొసమెరుపు. కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర కోదండరెడ్డి, జడ్పిటిసి ఎస్.శ్రీనివాసులు, పిఎసిఎస్ అధ్యక్షులు మునిరత్నం గౌడ్, వైస్ ఎంపీపీలు టీవీ పట్టాభి, సరస్వతి రమేష్, కో ఆప్షన్ సభ్యులు బి నిసార్, మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జోరేపల్లి రామచంద్రయ్య అన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుల ముఖ్యుల సమావేశం ఎస్‌టియు కార్యాలయంలో సురేష్ అధ్యక్షతన జరిగింది. జోరేపల్లి రామచంద్రయ్య సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు అనారోగ్య బారిన పడకుండా ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటానికి తమ ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా సేవలు చేస్తున్న పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో అయా మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. జిల్లాలోని కొన్ని మున్సిపాలిటీలో కార్మికులకు పిఎఫ్, ఇ.ఎస్.ఐ అమలు చేయకపోవడం దురదష్టకరమన్నారు. కార్మికులు మరణిస్తే వారికి మట్టి ఖర్చులు కూడా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించడంలో జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం కార్మికులకు ఇవ్వవలసిన సోపు, నూనె, చెప్పులు, యూనిఫారం, క్రమం తప్పకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి: ఎమ్మెల్యే



ప్రజాశక్తి-పలమనేరు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ అందరి మన్ననలు పొందుతుందని ఎమ్మెల్యే వెంకటే గౌడ తెలిపారు. శనివారం మండిపేట, కోటూరు గ్రామపంచాయతీలోని పాత సాంబార్ పూర్, యం.కోటూరు, కాలవ పల్లి, ఊసరపెంటలో గడపగడపకు ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండిపేట పంచాయతీ నూతన గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం ఆయన గడపగడపకు వెళ్లి నాలుగేళ్ల పాలనలో ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారికి బుక్లెట్ అందిస్తూ, వాలంటీర్లు స్పందిస్తున్నారా అంటూ ఆరా తీసి, ప్రతి గడపలో ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఎం జగనన్న అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, ఎంపీపీ రోజా, వైస్ ఎంపీపీ జయశ్రీ, రూరల్ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా భావానికి ప్రతిరూపం నర్సింగ్ వృత్తి



ప్రజాశక్తి-కుప్పం: పట్టణంలోని కుప్పం కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో శనివారం నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని బీసీఎల్ విద్యాసంస్థల అధ్యక్షులు బీసీ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేసీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ చైతన్య కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి సేవా భావానికి ప్రతిరూపమని, సమాజానికి వైద్యుడు ఎంత అవసరమో నర్సు కూడా అంతే అవసరం అని అన్నారు. కార్యక్రమంలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఉపాధ్యక్షులు సునీల్ రాజ్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి సాగర్ రాజ్, కుప్పం కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ విమల, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-యాదమరి: వడ్డెర్లపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని చిత్తూరు జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రవీందర్ రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్య సాయి జిల్లా, గోరంట్ల మండలం, వెంకటరమణ పల్లి గ్రామంలో వడ్డెర కుటుంబాల వారు 10 సెంట్ల ప్రభుత్వ భూమిలో పేడ దిబ్బలు వేసుకుంటుండగా, వైసీపీ నాయకుడు ఆ భూమిని కబ్జా చేయడానికి వెళ్లినప్పుడు వడ్డెరలు అడ్డు చెప్పారని వడ్డెర్లందరూ తెలుగుదేశం పార్టీ సానుభూతి పరులు అనే ఉద్దేశ్యంతో ఆ వడ్డెరల కుటుంబాలపై వైసీపీ నాయకుడు చౌటి రెడ్డి ఇతర ప్రాంతాల నుండి రౌడీలను పిలిచి దాడి చేయడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. దీనిని రాష్ట్ర వడ్డెర సాధికార కమిటీ అధ్యక్షులు వడ్డే వెంకట్, పూతలపట్టు నియోజకవర్గం తెలుగుదేశం బీసీ సెల్ కమిటీ అధ్యక్షులు ధరణి ప్రకాష్, జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు రవీందర్ రాజు ఖండించారు. దాడి చేసిన వ్యక్తులపై 307 సెక్షన్ కేసు నమోదు చేసి, బాధితులకి న్యాయం చేయాలని, అలా లేనిచో చలో గోరంట్లకు పిలుపు ఇవ్వడం జరుగుతుందని, తెలుగుదేశం పార్టీ ప్రకటించిన బీసీ చట్టాన్ని తీసుకుని తరువాత ఈ రౌడీలకి తగిన బుద్ధి చెబుతామని పూతలపట్టు నియోజకవర్గ వడ్డెర సోదరులు తరపున హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ వడ్డెర సంఘ నాయకులు భాస్కర్, అశోక్, మణికంఠ, రుద్రయ్య అరుణ్ కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఏనుగుల దినోత్సవం



ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని ననియాల ఎకో టూరిజం వద్ద అటవీ శాఖ అధికారులు ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. శనివారం ఎకో టూరిజం ఆవరణలో ఏనుగులు జయంత్, వినాయక్‌లకు వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గజరాజులకు పండ్లు, ఫలహారాలు అందించి ఆశీర్వచనం తీసుకున్నారు. అడవులు, జంతుజాలాల సంరక్షణతోనే మానవాళి ముడిపడి ఉందని అటవీ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుప్పం రేంజర్ అధికారి వైసిరెడ్డి, పాస్టర్ బాబు ప్రసాద్, సిబ్బంది కష్ణ ప్రసాద్, పుల్లయ్య, ఏనుగుల సంరక్షణ సిబ్బంది, ట్రాకర్స్ పాల్గొన్నారు.



వ్యర్థాలను తొలగించండి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మురికి కాలువలో వ్యర్థాలను తొలగించాలని మండలంలోని ఆండారెడ్డిపల్లి, తగువారి పల్లి, బంగారుపాళ్యం గ్రామస్తులు తెలిపారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ మండలంలోని మురికి కాలువల్లో వ్యర్థాలను తొలగించకపోవడంతో మురికి నీరంతా వీధులలో ప్రవహిస్తున్నాయని, దీంతో దోమలు వద్ధి చెంది వాటి వలన విష జ్వరాలు వ్యాపిస్తాయని, మురికి కాలవలో చెత్తాచెదారం అధికంగా చేరుతుందని వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మురికి కాలువల్లోని వ్యర్థాలను తొలగించాలని కోరారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించాలి



ప్రజాశక్తి-నగరి: 'ఆజాదీకా అమత్ మహోత్సవ్'లో భాగంగా సీఎం వైఎస్ జగన్ పిలుపు మేరకు రాష్ట్రంలోని ప్రతి ఇంటిపై ఆగస్టు 13 నుండి 15 వరకు జాతీయజెండాను ఆవిష్కరించే 'ఘర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన అభ్యుదయ, క్రీడాశాఖ మంత్రి ఆర్.కె.రోజా శనివారం పేర్కొన్నారు. ప్రతి ఇంటిపైనా మన భారత జాతీయ జెండాను ఎగురవేసి మనకున్న దేశభక్తిని చాటుకోవాలని, తన శాఖా పరిధిలోని అధికారులు దీన్ని పాటించి, విస్తత ప్రచారాన్ని కలిగించి విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ఆర్డీవోకు ఫిర్యాదు




ప్రజాశక్తి-కుప్పం/రామకుప్పం: కుప్పం నియోజకవర్గ పరిధిలోని గుడుపల్లి, రామకుప్పం మండలాలలో జరుగుతున్న వార్డు ఎన్నికలలో చట్ట విరుద్ధంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించడం జరిగిందంటూ స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం ఆర్డీవో శివయ్యను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గుడుపల్లి మండలం పిబి వాడ గ్రామ పరిధిలోని మూడవ వార్డు, రామకుప్పం మండలం 89 పెద్దూరు పరిధిలోని ఆరవ వార్డు లకు ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఇందులో భాగంగా నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యిందని, నామినేషన్ల తిరస్కరణ ప్రక్రియలో భాగంగా అధికారులు తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల నామినేషన్లను చట్టవిరుద్ధంగా తిరస్కరించారంటూ ఆరోపించారు. అధికార పార్టీ ఒత్తిడి వల్ల ప్రభుత్వ అధికారులు ఇలాంటి పనులకు పాల్పడుతున్నట్టు తెలిపారు. కావున ఈ విషయమై తగిన విచారణ జరిపి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు న్యాయం చేయాలంటూ ఆర్డీవోను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గాజుల ఖాదర్ భాషా, పిఎస్ మునిరత్నం, కన్నన్, వెంకటేష్, శ్రీకాంత్, న్యాయ విభాగం నాయకులు మధుసూదన్, వాసు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నగరి: హాకీ విజార్డ్ ధ్యాన్ చంద్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వి.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2022-23కు మాత్రమే ఇది వర్తిస్తుందన్నారు. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులకు దరఖాస్తు చేసుకునే పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు సంబంధిత స్పోర్ట్స్ గేమ్స్ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలపై కౌంటర్ సైన్ చేయాలన్నారు. టీం ఈవెంట్లు, డిస్ట్రిక్ట్ ఎక్సలెన్స్ ఈవెంట్లకు సంబంధిత పాయింట్లు ఇప్పటికే పాఠశాలలకు అందజేయడం జరిగిందన్నారు. నిర్దిష్ట, అనుబంధ గేమ్‌లో గానీ పొందిన అత్యధిక స్కోరు పరిగణలోకి తీసుకుంటారన్నారు. అలాగే జిల్లాలో అధిక స్కోర్‌ను సాధించిన 5 పాఠశాలలను స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపిక చేస్తారన్నారు. ఈ అవార్డులకు పాఠశాల స్థాయి క్రీడా పోటీలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారని, అసోసియేషన్ గేమ్స్ పరిగణలోకి తీసుకోరన్నారు. ఈ నెల 16 లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. 18న అప్లికేషన్లు పరిశీలిస్తారని, 20న అభ్యంతరాలు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 23 న క్రీడా ప్రతిభా అవార్డుల దరఖాస్తులు ఖరారు చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సాయిప్రశాంతికి అందించాలన్నారు.

వైభవంగా అభిషేక పూజలు



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో గల శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ కోనేటి వద్ద ఉన్న సంతాన వేంకటేశ్వర స్వామికి శనివారం అభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలో శనివారం స్వామి, అమ్మ వార్లను సుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేష్‌లు రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వేటగాళ్ల అరెస్ట్



ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలో చిరుత మృతి చెందిన కేసులో నలుగురు వేటగాళ్ళను అరెస్టు చేసినట్లు కుప్పం అటవీ శాఖ రేంజర్ వై.సి.రెడ్డి శనివారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత జులై 25న రామకుప్పం మండలం నారాయణపురం అటవీ ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో చిరుత మతి చెందింది. చిరుత మృతికి సంబంధించి దర్యాప్తు చేయగా నల్లరాళ్ల చేను, పూలచేన్లు, వీర్ణమల, పోడుచేన్లు గ్రామాలకు చెందిన శరవణ్, తిరుపతి, కాశిరాజు, సుబ్రమణ్యంను నిందితులుగా గుర్తించి, వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి




ప్రజాశక్తి-పాలసముద్రం: దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకోవాలని ఎంపీపీ శ్యామల శివ ప్రకాష్ రాజు, జడ్పిటిసి అన్బలగం, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. శనివారం సింహరాశిపురం, శ్రీ కావేరి రాజు పురం గ్రామ పరిధిలో సర్పంచ్ భాస్కర్ రెడ్డి, గాలి మహేష్ బాబు, ఎంపిడివో ప్రేమ్ రాజ్ కుమార్, ఏపీఓ మార్గా రేట్ సమక్షంలో నా భూమి-నా దేశం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ శ్యామల శివ ప్రకాష్ రాజు, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ దేశభక్తిని పెంచేందుకు స్వాతంత్ర్య సమరయోధులను గౌరవించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ జేఈ అనూష, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రమైన బైరెడ్డిపల్లి నుండి 10 మంది యువకులు కాలినడకన తిరుమలకు పాదయాత్రతో శనివారం తరలివెళ్లారు. స్థానిక బి.సి.కాలనీలోని పెద్దపులి గంగమ్మకు, అనంతరం గ్రామ దేవత శ్రీ భాటగంగమ్మకు పూజలు చేసి యాత్రకు శ్రీకారం చుట్టారు. మంగళవారానికి తిరుమల చేరుకొని కలియుగ వైకుంఠంలో కొలువైవున్న శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటామని భక్తులు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పాదయాత్రలో స్థానికులు అమరనాథ్, సుధీర్ రెడ్డి, కోదండ, రాజు, శంకర, మురుగేష్, సుబ్రహ్మణ్యం, విజయకుమార్, బాలాజీ, నాగరాజ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



ప్రజాశక్తి-కుప్పం: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పీఈఎస్ మెడికల్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రతినెలా రెండవ శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్ పర్సన్ డా.ఎ.మహేష్ తెలిపారు. కుప్పంలో లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసినప్పటి నుండి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. అందులో భాగంగానే శనివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని, కుప్పం ప్రాంతానికి దగ్గరలో ఉన్నటువంటి ప్రజలు ఈ వైద్య శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలను చేయించుకున్నారని, అందులో 30 మందిని శస్త్ర చికిత్సకు పీఈఎస్ వైద్యులు సిఫార్సు చేసినట్లు మహేష్ తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి మధ్యాహ్న భోజనాన్ని స్థానిక కేసీ ఆసుపత్రి వారు అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మొదటి వైస్ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్, కోశాధికారి పిజి సెల్వం, డైరెక్టర్లు శివ, లెనిన్, కష్ణమూర్తి, చంద్ర ప్రకాష్, చరణ్, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల లియో లయన్స్ క్లబ్ విద్యార్థులు, పీఈఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీకి టీడీపీ నేతల సంఘీభావం



ప్రజాశక్తి-రామకుప్పం: శాంతిపురం మండలంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నేతలకు రామకుప్పం మండల టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. శనివారం శాంతిపురం మండలంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పత్రా నారాయణచారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుకి లక్ష ఓట్ల మెజార్టీతో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కషి చేస్తున్నారన్నారు. విపక్ష పార్టీ దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో ప్రజలు విసిగిపోయారని సుపరిపాలన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గ్రామాలు అభివద్ధికి నోచుకోక తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజలకు మరో ఎనిమిది నెలల్లో ఉపశమనం కలుగుతుందన్నారు. టిడిపి హయాంలో చేసిన అభివద్ధి, సంక్షేమాలను ప్రజలు ఎప్పటికీ గుర్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రామ్మూర్తి, నందా రెడ్డి, మనోహర్, జయశంకర్, సత్తి, మహమ్మద్ రఫీ, విశ్వనాథ్, రఘు, వీరనాగపురం నాగరాజు పాల్గొన్నారు.